రాత్రి ఎనిమిది గొట్టింది. విక్రమార్కుడు జల్దిజల్ది గింత దిన్నడు. మోటర్ దీస్కొని ఇంట్లకెల్లి ఎల్లిండు. మోటర్ నడిపిచ్చుకుంట గాడు బొందల గడ్డదిక్కు బోబట్టిండు. సరింగ రాత్రి పదకొండుగొట్టంగ గాడు బేతాలుని ఇంటి ముంగట మోటర్ రుకాయించిండు. రుకాయించి హారన్ గొట్టిండు. హారన్ సప్పుడు ఇనంగనే బేతాలుడు ఇంట్ల కెల్లి ఇవుతలికి వొచ్చిండు. ఇంటికి తాలం బెట్టిండు. తాలం బెట్టినంక మోటర్ల గూసున్నడు. బేతాలుడు మోటర్ల గూసోంగనే విక్రమార్కుడు మోటర్ నడిపియ్యబట్టిండు. గప్పుడు మోటర్ల గూసున్న బేతాలుడు–

"నన్ను గూసుండబెట్టుకోని మోటర్ నడిపిస్తుంటె నీకు యాస్ట రావొచ్చు. నీకు యాస్ట రాకుంట ఉండెతందుకు ఒక కత జెప్త ఇను. దుబాయ్ కెల్లి అక్రం ఖాన్ అనేటి ఒక అరబ్బోడు పని మీద పట్నం వొచ్చిండు. పట్నంల గాడు నెల దినా లున్నడు. నెల దినాలు ఊకె ఉండుడు ఎందుకనుకున్నడు. అనుకోని పెండ్లి జేసుకుంటె బాగుంటదనుకున్నడు. అనుకోని ఒక ఖాజి తాన్కి బోయిండు. బోయి–

"నేను ఎవ్వలన్న సక్కని పొల్లను పెండ్లి జేస్కుందామనుకుంటున్న. నా గురించి ఒక సక్కని పొల్లను జూడుండ్రి" అని అన్నడు.

"మంచి గట్లే జూస్త" అని ఖాజి అన్నడు.

ఖాజి అరబ్బోని కోసం పొల్లను లెంకబట్టిండు. లెంకంగ లెంకంగ సయ్యద్ పాషా అనే టోనికి నలుగురు పొల్లలు ఉన్నరని గాయినకు ఎర్క అయ్యింది. పెద్ద పొల్ల ముంతాజ్ సక్క గుంటది. గని గా పొల్లకు పెండ్లి జేద్దామంటె సయ్యద్ పాషా తాన పైసలు లెవ్వు. గానికి దినమెల్లుడే కస్టంగ ఉంటె ఇగ పొల్లకు యాడి కెల్లి పెండ్లి జేస్తడు. ఖాజి గానికి తాన్కి బోయిండు.

"మీ పెద్దపొల్లకు పెండ్లి ఎప్పుడు జేస్తవు?" అని సయ్యద్ పాషాను అడిగిండు.

"నేను శాన బీదోన్ని. మా పొల్లకు పెండ్లి ఎట్ల జెయ్యాలెనో సమజైతలేదు" అని సయ్యద్



# తలాక్

పాషా అన్నడు.

"నువ్వేం ఫికర్ జెయ్యకు. మీ పొల్లకు పెండ్లి జేస్తె ఉల్ట నీకే పైసలు వొచ్చేటి తరీక జెప్త" అని ఖాజి అన్నడు.

"గదెట్ల" అని సయ్యద్ పాషా అడిగిండు.

"అక్రం ఖాన్ అనేటి అరబ్బోడు గీ నడుమనే పట్నం వొచ్చిండు. గాడు ఎవలన్న సక్కని పొల్ల దొరికితె పెండ్లిజేస్కుందామనుకుంటున్నడు" అని ఖాజి అన్నడు.

"మా పొల్లను పెండ్లిజేస్కుంటె నాకు గాడు పైసలిస్తడా?" అని సయ్యద్ పాషా అడిగిండు.

"ఇస్తడు. నువ్వు బేఫికర్గ ఉండు. గాని తానికెల్లి నీకు పైసలిపిచ్చే బరోస నాది" అని ఖాజి అన్నడు.

"గట్లయితె అక్రం ఖాన్కు మా పొల్లను ఇచ్చి పెండ్లిజేస్త" అని సయ్యద్ పాషా అన్నడు.

ఖాజి, అక్రం ఖాన్ తాన్కి బోయిండు. సయ్యద్ పాషా పెద్దపొల్ల ముంతాజ్ గురించి జెప్పిండు.

"గా పొల్లను నాకిచ్చి పెండ్లిజేస్తివా అంటె సయ్యద్ పాషాకు లచ్చరూపాలు ఇస్త" అని అక్రం ఖాన్ అన్నడు.

"మల్ల నాకేమిస్తవు?" అని ఖాజి అడిగిండు.

"నీకు ఇర్వైఐదు వేల రూపాలిస్త" అని అక్రం ఖాన్ అన్నడు.

ఒక దినం ముంతాజ్తోని అక్రం ఖాన్కు పెండ్లి అయ్యింది. అన్న తీర్గనే అక్రంఖాన్

**సింగిల్ పేజీ కథ**

ఖాజి ఇర్వైఐదువేల రూపాలు, సయ్యద్ పాషాకు లచ్చరూపాలు ఇచ్చిండు. మస్తుపైసలున్న అరబ్బోనితోని పొల్ల పెండ్లి అయినందుకు సయ్యద్ పాషా కుషయ్యిండు. ముంతాజ్ గూడ కుషయ్యింది. ఒక పెద్ద హోటల్ల అక్రం ఖాన్ ముంతాజ్ను ఉంచిండు. బిర్యాని దినిపిచ్చిండు.

"గియ్యాల్ల గోల్కొండకు బోయొద్దామా?" అని అక్రం ఖాన్, ముంతాజ్ను అడిగిండు.

"పోదాం" అని గామె అన్నది.

అక్రం ఖాన్ ఒక టాక్సి దీస్కున్నడు. ఇద్దరు గలిసి టాక్సిల గోల్కొండకు బోయిండ్రు. గోల్కొండ జూసినంక–

"గండిపేట కాడ్కి పోదామా?" అని అక్రం ఖాన్ అడిగిండు.

"పోదాం" అని ముంతాజ్ అన్నది.

ఇద్దరు గల్సి గండిపేట బోయిండ్రు. దీపాలు బెట్టే యాల్ల టాక్సిలనే హోటల్కు వొచ్చిండ్రు. గింత దిన్నంక –

"సిన్మకు గిన బోదామా?" అని అక్రం ఖాన్ అడిగిండు.

"పోదాం పాండ్రి" అని ముంతాజ్ అన్నది.

ఇద్దరు గలిసి ఆటోల సిన్మకు బోయిండ్రు.

గిట్ల దినాం అక్రంఖాన్, ముంతాజ్ పట్నంల దిర్గబట్టిండ్రు. ముంతాజ్ పట్నంలనే పుట్టినంక గూడ ఎన్నడు ఇంట్లకెల్లి ఇవుతలకు ఎల్లలేదు. అక్రం ఖాన్ జెయ్యబట్కె గామె పట్నమంత జూసింది. అదృస్టం కొద్ది గిసుంటి మొగడు దొర్కిండని గామె అనుకొన్నది. నెల దినాలు అక్రం ఖాన్, ముంతాజ్ను మల్లె పువ్వు లెక్క జూస్కున్నడు. నెల దినాలైనంక గాడు ఖాజిని బిలిసిండు.

"ఎందుకు నన్ను రమ్మన్నవు" అని ఖాజి అక్రం ఖాన్ను అడిగిండు.

"నేను దుబాయ్కి బోదామనుకుంటున్న. పొయ్యే ముంగట ముంతాజ్కు తలాక్ ఇద్దామనుకుంటున్న" అని అక్రం ఖాన్ అన్నడు.

అన్న తీర్గనే అక్రం ఖాన్, ముంతాజ్కు తలాక్ ఇచ్చిండు. తలాక్ ఇచ్చి దుబాయ్ బోయిండు.

కత ఇన్నవు గద. గీ కతల అరబ్బోడు ఎవడు? గాడు తలాక్ ఇచ్చిన పొల్ల ఎవ్వలు? గీ సవాల్కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకబోతివా అంటె నీ మోటర్ బిరక్ పేలైతది" అని బేతాలుడు అన్నడు.

"ఎలచ్చన్ల ముంగట గది జేస్తం గిది జేస్తం అని జెప్పేటి లీడరే అరబ్బోడు. గాని మాటలను బరోసజేసిన పొల్లనే జెనం. ఎలచ్చన్ల ముంగట హనీమూన్కు గొంచబోయిన లీడర్ ఎలచ్చన్లు అయినంక తలాక్ అన్కుంట జెనంకు గండ్లబడకుంట బోతడు" అని విక్రమార్కుడు జెప్పిండు.

గాడు గట్ల జెప్పంగనే బేతాలుడు మోటర్ రుకాయించుమన్నడు. విక్రమార్కుడు మోటర్ రుకాయించంగనే బేతాలుడు మోటర్ల కెల్లి దిగిండు. ఆటో దీస్కొని బొందల గడ్డ కాడ ఉన్న ఇంటికి బోయిండు.

– తెలిదేవర భానుమూర్తి